పబ్లిక్ అవసరాలు తీర్చలేనివిగా..

నిరుపయోగంగా మారిన పబ్లిక్ టాయిలెట్లు

- తాళం వేసిన వాటిని తెరిచేది లేదు
- మరమ్మతులకు గురైన వాటిని పట్టించుకోరు
- పట్టించుకోనివి శిథిలావస్థకు...



తాళం వేసి ఉన్న 26వ డివిజన్‌లో ఆర్‌వోబీ కింద పబ్లిక్ టాయిలెట్లు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ప్రజల సౌకర్యార్థం నిర్మించిన పలు పబ్లిక్ టాయిలెట్లు నిరుపయోగంగా మారాయి. కొన్నింటిని ఉపయోగించకుండా వదిలేయగా, మరికొన్ని మరమ్మతులకు గురయ్యాయి. దీంతో లక్షల రూపాయలతో నిర్మించిన టాయిలెట్లు వృథాగా మారాయి. రద్దీ ప్రాంతాల్లోని టాయిలెట్లను మూసి ఉంచడంతో ప్రజల అవసరాలను తీర్చలేనివిగా మిగిలిపోతున్నాయి.

నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్లు..

కేఎంసీ పరిధిలో రూ.5.1 కోట్లు ఖర్చు చేసి 41 పబ్లిక్ టాయిలెట్లను నిర్మించారు. నగరానికి వివిధ పనులపై వచ్చే వారు, వివిధ ప్రాంతాల్లో పని చేసే కార్మికులకు, ఇతరులకు ఉపయోగపడేలా ఉదయం 6 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు వీటిని తెరిచి ఉంచేలా నిర్ణయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. కోట్ల రూపాయలు ఖర్చు చేసిన నిర్మించిన టాయిలెట్స్ ప్రజా అవసరాలకు ఉపయోగపడడం లేదు. చాలా టాయిలెట్ల వద్ద సరైన నిర్వహణ లేక అపరిశుభ్రంగా మారాయి. కొన్ని చోట్ల తాళాలు వేసి ఉండగా, మరికొన్నింటిలో నీటి సౌకర్యం లేక, తలుపులు విరిగిపోయి దర్శనమిస్తున్నాయి.ఇక లక్షల రూపాయలు వెచ్చించి మయూరిసెంటర్ ఆర్‌వోబీ కింద నిర్మించిన టాయిలెట్స్‌ను తొలగించారు.

ప్రజలకు తీవ్ర అసౌకర్యం..

కొన్ని పబ్లిక్ టాయిలెట్లు మాత్రం 'పే- యూస్' విధానంలో నడుస్తున్నాయి. కేఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన అన్ని టాయిలెట్లను పే-యూస్ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇచ్చారు. అయితే కొన్నింటిని నిర్వహిస్తున్నా.. మిగిలిన వాటిని మాత్రం పట్టించుకోవడం లేదు. అత్యవసర సమయాల్లో పబ్లిక్ టాయిలెట్ల కోసం వెతుక్కునే వారికి నిరాశే ఎదురవుతోంది. బస్టాండ్, మార్కెట్ ప్రాంతాలు రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది.


గాంధీపార్క్ వద్ద..


వేణుగోపాల్‌నగర్ ఎన్‌ఎస్పీ కెనాల్ వాక్‌వేపై డోర్లు ఊడిపోయి..

నిర్వహణ లోపంపై ఆరోపణలు

పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించినప్పటికీ వారు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆరోపణలున్నాయి. కేవలం నిర్మించి వదిలేయడంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కేఎంసీ అధికారులు తక్షణమే స్పందించి, నిరుపయోగంగా ఉన్న పబ్లిక్ టాయిలెట్లను పునరుద్ధరించి, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. నిర్వహణను పర్యవేక్షించి, వాటిని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపయోగంలోకి తీసుకురావాలి..



నగరంలో లక్షల రూపాయలు ఖర్చు చేసి పబ్లిక్ టాయిలెట్స్‌ను నిర్మించారు. కొన్ని చోట్ల మాత్రమే పే అండ్ యూస్ విధానంలో ఉపయోగిస్తున్నారు. చాలా చోట్ల తాళాలు వేసి తీయడం లేదు. ఇతర ప్రాంతాల నుండి పని కోసం నగరానికి వచ్చిన కార్మికులు టాయిలెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే నగరంలోని అన్ని టాయిలెట్స్‌ను తెరిచి ప్రజా అవసరాలకు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలి.

– జ్వాలా నరసింహరావు, సీపీఐ నాయకులు

టాయిలెట్లను పరిశీలిస్తాం..



నగరంలో అన్ని పబ్లిక్ టాయిలెట్లు ఉపయోగంలో ఉన్నాయి. కొన్నింటిని తెరవడంలేదని మా దృష్టికి వచ్చింది. వాటిని సమయపాలన ప్రకారం తెరవాలని కేర్ టికర్స్‌కు సూచిస్తాం. మరమ్మతులకు గురైన టాయిలెట్లను పరిశీలించి వాటిని ఉపయోగంలోకి తీసుకొస్తాం.

– ఎం.సాంబయ్య, శానిటరీ సూపర్‌వైజర్, కేఎంసీ

ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలి

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య


దరఖాస్తుదారుడితో మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజావాణిలో ప్రతీ దరఖాస్తును పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. కేఎంసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుదారులు ఏ డివిజన్ నుండి వచ్చారో, ఏ సమస్యను ఎదుర్కొంటున్నారో తెలుసుకుని సంబంధిత విభాగాలకు ఆ సమస్యలను అప్పగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా రెవెన్యూ సంబంధిత అంశాలు తక్షణమే పరిష్కరించగలిగినవి పరిష్కారం చేయాలన్నారు. శానిటేషన్‌కు సంబంధించిన అర్జీలు పరిష్కారం అనంతరం ఫొటోలు తీసి తనకు నేరుగా పంపాలని ఆదేశించారు.

ఖమ్మం అభివృద్ధిని వినిపించాం..


మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరంలో జరిగిన అభివృద్ధిని, పారిశుద్ధ్య నిర్వహణను హర్యాణ రాష్ట్ర వేదికగా వివరించామని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. సోమవారం కేఎంసీలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఢిల్లీ, హరియాణా పర్యటనకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. హర్యాణలో జరిగిన జాతీయ స్థాయి సదస్సులో మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర విషయాలను మహానగరాలుగా ఉన్న కార్పొరేషన్ చైర్మన్లు వారి వద్ద అనుసరిస్తున్న విధానాలను వివరించారన్నారు. డంపింగ్‌యార్డ్‌లు లేకుండా ఏ రోజు చెత్తను ఆ రోజు శుభ్రం చేసే విధానాన్ని పరిశీలించామన్నారు. చెత్త సేకరణలో ఖమ్మం కూడా మెరుగ్గా ఉందని తెలిపామన్నారు. కొట్టివేసిన చెట్ల కొమ్మలు, ఆకులను క్రష్ చేసే మిషన్‌ను ఈ సదస్సులో చూశామని, దానిని కేఎంసీలో ఏర్పాటు చేసుకునే ఆలోచనలు చేస్తున్నామన్నారు. ఏ కార్పొరేషన్‌లో లేని విధంగా మన దగ్గర వ్యర్థాల బయోమైనింగ్ మిషనరీ నడుస్తుందని, వ్యర్థాల నిర్వహణకు సంబంధించి మెరుగైన ఆలోచనలు చేస్తున్నామని, త్వరలోనే చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా ఉన్నారు.

బంగారు పతకాలు అందుకున్న విద్యార్థులు


బంగారు పతకాలు అందుకున్న కేఎండీసీ, ఆర్‌జేసీ, ప్రియదర్శిని విద్యార్థినులు


ఖమ్మంలీగల్: మానేర్ లా విద్యార్థులు..

ఖమ్మం సహకారనగర్: వరంగల్‌లో సోమవారం జరిగిన కాకతీయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు బంగారు పతకాలు అందుకున్నారు. ఆర్‌జేసీ విద్యార్థి సాయి వీరసుప్రియ రెండు బంగారు పతకాలను యూనివర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందుకుందని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. అలాగే, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఇస్రత్ పర్వీన్, ప్రియాంక బంగారు పతకాలు స్వీకరించగా సెక్రటరీ, కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ కే.వీ.రమణారావు, వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, అధ్యాపకులు కల్పన, గీత, ఎం.రంగారావు అభినందించారు. అదేవిధంగా ప్రియదర్శిని విద్యాసంస్థల విద్యార్థులు ఎస్.లలిత, సరస్వతిలు బంగారు పతకాలు అందుకోగా చైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు, ప్రిన్సిపాల్ వి.రామారావు, అకడమిక్ డైరెక్టర్ యం.శివకుమార్ తదితరులు అభినందించారు.

ఖమ్మంలీగల్: ఖమ్మంలోని మానేర్ లా కళాశాల విద్యార్థులు జోషి నవీన్, తేజోవర్ధన్, గారపాటి సూర్యనారాయణ, సిరిమల్ల స్రవంతి, వంగవీటి వాసవీకుమారి 12 బంగారు పతకాలు సాధించగా కాలేజీ సెక్రటరీ యూనుస్ సుల్తాన్ తదితరులు అభినందించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి


ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఖమ్మంరూరల్: దేశవ్యాప్తంగా రేపు(బుధవారం) జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్ రావు అన్నారు. ఈ మేరకు సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ మండలంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. నాయకులు రామయ్య, నాగరాజు, వెంకన్న, రాములు ఉన్నారు.

సమ్మెకు మద్దతు..

ఖమ్మంవ్యవసాయం: జాతీయ కార్మిక సంఘాలు, జాతీయ విద్యుత్ సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు సమ్మెకు జిల్లా విద్యుత్ కార్మిక, ఉద్యోగ, ఇంజనీర్ల జేఏసీ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు విద్యుత్ జేఏసీ కార్మిక సంఘాల, ఉద్యోగ సంఘాల, ఇంజనీర్ల అసోసియేషన్ ప్రతినిధుల సమావేశం నగరంలో నిర్వహించారు. జేఏసీ చైర్మన్ టి.శేషగిరి, రవికుమార్, ప్రసాద్, రాయకృష్ణ, నాగేశ్వరరావు, సీతారామయ్య, సురేష్, నరసింహారావు ఉన్నారు.

రఘునాథపాలెం: సమ్మెకు పీవైఎల్ సంపూర్ణ మద్దతు తెలిపుతుందని ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఇస్లావత్ రమేష్ అన్నారు. మండలంలోని రాంక్యతండాలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

పోస్టర్ల ఆవిష్కరణ..


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంవైద్యవిభాగం: సమ్మె పోస్టర్లు, కరపత్రాలను జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఆవిష్కరించారు. టీయూసీఐ నాయకులు అంబేద్కర్ జగదీష్, సైదులు, షబ్బీర్, రాధమ్మ, భాను, లలిత పాల్గొన్నారు

క్లుప్తంగా

రాష్ట్ర రగ్బీ జట్టులో స్థానం


బి.గౌతమ్

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఖమ్మం నయాబజార్ కళాశాలకు చెందిన విద్యార్థి బి.గౌతమ్ ప్రతిభ కనబరిచాడు. దీంతో ఈనెల 12నుంచి ఉత్తరాంచల్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టులో స్థానం దక్కిందని పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు..

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలకు చెందిన ఎం.చార్విత రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 9 నుంచి 12 వరకు రామకృష్ణపూర్‌లో జరిగే పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపిక కావడంపై కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్. పార్వతీరెడ్డిలు అభినందనలు తెలిపారు.

బాసర ట్రిపుల్ ఐటీలో సీటు

తిరుమలాయపాలెం: మండలంలోని జల్లేపల్లి పాఠశాలకు చెందిన కుంభం మనీష్‌కుమార్ ఇటీవల ప్రకటించిన ఫలితాలలో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం దారా రాజేష్, ఉపాధ్యాయులు మనీష్‌కుమార్‌ని అభినందించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గురుకులాల ఆర్‌సీఓ

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ మైనార్టీ గురుకులాల ఉమ్మడి జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ ఎం.జీ.అరుణకుమారి సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిశారు. ఖమ్మంలో కలెక్టరేట్‌ను కలిసిన ఆమె పూలమొక్క అందజేశారు. ఆ తర్వాత గురుకులాల్లో ప్రవేశాలు, బోధన వివరాలను వెల్లడించారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 10న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కోరారు. ఈ మేరకు సోమవారం సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఖమ్మం సుందరయ్య భవనంలో జిల్లా అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను విడుదల చేయాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు హరీష్, భాను, నాయకులు త్రినాథ్, సుశాంత్, వంశీ, మణికంఠ ఉన్నారు.

గ్రంథాలయ తరలింపును మానుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం రోటరీనగర్ 9వ డివిజన్ పార్కులో 30 ఏళ్లుగా ఉన్న గ్రంథాలయం తరలించాలని కొంతమంది వ్యక్తులు ప్రయత్నం చేస్తున్నారని, గ్రంథాలయ తరలింపును మానుకోవాలని బీజేపీ నాయకులు కుమిలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ అర్బన్ టౌన్ జనరల్ సెక్రటరీ అంజన్న పాల్గొన్నారు.


కమిటీ ఎన్నిక

నేలకొండపల్లి: ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తకొండ వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా మౌలానా, కోశాధికారిగా రామగిరి రవిలను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్, గౌరవ సలహాదారుడు దేవర నాగరాజు, కనకరావు, సత్యనారాయణ, తిరుపతిరావు, శ్రీకాంత్ ఉన్నారు.

మీటర్ల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం రమణగుట్టతో పాటు రామచంద్రయ్య నగర్ ప్రాంతంలో కరెంట్ మీటర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్నాచౌక్‌లో బహుజన జేఏసీ, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బాధితులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు పగిడిపల్లి నాగేశ్వరరావు, సంజీవరావు, అఖిల్, భద్రునాయక్, ఉపేంద్రబాయి, రవీంద్ర నాయక్, త్రివేణి, వీరన్న ఉన్నారు.

వీల్‌చైర్లు వితరణ



రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం మంచుకొండ, ఖమ్మం రూరల్ ఎం.వి. పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ముస్తఫా నగర్, శ్రీనివాస నగర్ అర్బన్ హెల్త్ సెంటర్లకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వీల్‌చైర్లను సోమవారం వితరణగా అందించారు. ఎస్‌బీఐ ఖమ్మం డీజీఎం బినోద్ కుమార్ సిన్హా, వైద్యాధికారులు బాలకృష్ణ, చందన, రమేష్ , తాళ్లూరి శ్రీకాంత్, వనం రంగదాం, డేవిడ్, ఉపేంద్ర చారి, ఎస్బీఐ రీజినల్ మేనేజర్ రాజశేఖర్ ఉన్నారు.

సంక్షిప్తంగా..

పెత్తనం కోసం యుద్ధాలు సృష్టిస్తున్న అమెరికా


మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: అమెరికా సామ్రాజ్యవాద పెత్తనం నిలుపుకునేందుకే ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలు సృష్టిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని గజ్జల వెంకటయ్య భవనంలో పార్టీ రాజకీయ శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దిన్, నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు, రమేష్, మంగతాయారు, సుగుణమ్మ, పద్మనాభుల సుధాకర్, వీరన్న, నరసయ్య, వెంకన్న, స్వామి, వెంకటేష్, లింగయ్య, రమేష్, వరుణ్, నాగేశ్వరరావు, లింగస్వామి తదితరులు ఉన్నారు.

నేలకొండపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రావెళ్ల భవన్‌లో రెండు రోజుల పాటు జరిగిన రాజకీయ శిక్షణ తరగతులను సోమవారం ముగిశాయి. నాయకులు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి, నరసింహారావు, ఉమామహేశ్వరీ, సూర్యనారాయణ, లక్ష్మి, వెంకన్న, భాస్కర్, మధు, ప్రమీలా, కృష్ణ, చారీ, లింగరాజు, మల్లేశ్వరరావు, మల్లిఖార్జున్‌రావు, బాబు ఉన్నారు.

పత్తి పంట పరిశీలన


రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ తారాదేవి

కామేపల్లి: మండలంలోని సాతానిగూడెం గ్రామంలో పత్తి పంటను మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. పత్తి పంటలో వర్షపు నీరు నిల్వకుండా చూసుకోవాలని, కలుపు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ధరావత్ దేవ్‌సింగ్, సీతయ్య, రమేశ్, నాగమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా సమావేశంలో వెంకటేశ్వరరావు

ఖమ్మంవ్యవసాయం: బెంగళూరులో ఆది, సోమవారం జరిగిన కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) జాతీయ కార్యవర్గ సమావేశంలో సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు, జిల్లాకు చెందిన నల్లమల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలపై చర్చించి, వీటికి చట్టభద్రత కల్పించాలని కోరుతూ తీర్మానించారు. కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న రైతువ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 19న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మహా కిసాన్ పంచాయిత్ నిర్వంచాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్‌నాయక్ సోమవారం శంకుస్థాపన చేశారు. నాయకులు పెంటమళ్ల పుల్లమ్మ, పాపయ్య, కొమ్మినేని పుష్పావతి, వడ్లమూడి నర్సయ్య, విజయ్‌బాబు, ప్రసాద్ ఉన్నారు.

పది గంటల పని వేళల జీఓ దుర్మార్గం

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ ఫలితమే పది గంటల పని విధానమని, నేడు రాష్ట్ర ప్రభుత్వం జీవో తీసుకురావటం దుర్మార్గమని టీయూసీఐ జిల్లా కార్యదర్శి జి.రామయ్య అన్నారు. సోమవారం ఖమ్మం గట్టయ్య సెంటర్లో జీవో కాపీని దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్పొరేట్ వర్గాలకు లాభాలు చేకూర్చడానికి ఈ జీవోను తీసుకొచ్చారని, వెంటనే ఈజీఓను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి శ్రీనివాస్, బాబురావు, కాంతయ్య, నారాయణ, పార్థు కృష్ణ, రమేష్, రాము, వెంకటేశ్, రవి, జగదీష్, రంగయ్య, యదక్క, యుగంధర్, శ్రీను ఉన్నారు

సమాజాన్ని ఆలోచింపజేసేదే సాహిత్యం

ఖమ్మంమయూరిసెంటర్: సమాజాన్ని ఆలోచింపజేసేదే సాహిత్యమని ఆ దిశగా విస్తృత స్థాయిలో సాహిత్యం వెలువడాల్సి ఉందని పలువురు కవులు, వక్తలు అన్నారు. ప్రముఖ కవి ఏనుగు కిషోర్ బాబు రచించిన 'అడ్డుగోడలు', 'నడుస్తున్న చరిత్ర', 'కిషోర శతకం' అనే మూడు పుస్తకాల ఆవిష్కరణ సభ సోమవారం స్థానిక జెడ్పీమీటింగ్ హాల్లో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, కవి ప్రసేన్, విద్యావేత్త మువ్వా శ్రీనివాసరావు, కేసీపీ సిమెంట్ మేనేజర్ మధుసూదన్, తల్లాడ ఎంపీడీఓ ఏనుగు సురేష్ బాబు తదితరులు ఉన్నారు.


నేడు తుమ్మల పర్యటన

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు ఖమ్మం 15వ డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఆతర్వాత మహబూబాబాద్ జిల్లా పర్యటనకు మంత్రి బయలుదేరతారు.

నోట్ పుస్తకాల పంపిణీ


అమ్మగూడెంలో..

నేలకొండపల్లి: మండలంలోని అమ్మగూడెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఖమ్మం పట్టణానికి చెందిన శ్రీకాంత్ రూ.20 వేల విలువైన నోట్ పుస్తకాలను వితరణగా అందజేశారు. ఈ మేరకు సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ బీ.చలపతిరావు పుస్తకాలను పంపిణీ చేశారు. హెచ్‌ఎం టి.వెంగళరావు, మాజీ సర్పంచ్ గండు సతీష్, ఉపాధ్యాయులు జ్యోతిర్మయి, పంచాయతీ కార్యదర్శి హరీష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


నోట్ పుస్తకాలు వితరణ చేస్తున్న హెచ్‌ఎం

ఖమ్మంఅర్బన్: నగరంలోని వేణుగోపాల్‌నగర్ పాఠశాల విద్యార్థులకు వాసిరెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్సిల్స్ అందించారు. హెచ్‌ఎం గుడిపూడి శ్రీనివాసరావు, సేవాసమితి సభ్యుడు వాసిరెడ్డి సుబ్బారావు , చక్రధర్ రావు, అర్జున్ రావు, వీరభద్రం, రాధాకృష్ణ, రామ సీత, ఉపాధ్యాయురాలు జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌ను ప్రకటించాలి


మాట్లాడుతున్న కృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: మున్నూరుకాపు కార్పొరేషన్‌ను వెంటనే ప్రకటించాలని మున్నూరుకాపు సంక్షేమ సంఘం నాయకులు గుండాల కృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఖమ్మం 32వ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ నూతన గౌరవాధ్యక్షుడిగా మూలగుండ్ల శ్రీహరి, అధ్యక్షుడిగా కుమ్మరికుంట్ల సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరుకాపులు వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్నారని, కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి బడ్జెట్ కేటాయిస్తే మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తా సీతారాములు, మాటేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని 25వ డివిజన్‌కు చెందిన వల్లాల నాగరత్నం జన్మదినం సందర్భంగా సోమవారం రెండు పేదకుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. వాసవి క్లబ్, జిల్లా ఆర్యవైశ్య సంఘం సభ్యులు వల్లాల నమశ్శివాయ, యుగంధర్, రాధాకృష్ణ, శ్రీనివాస్, జయరాం, మోహన్‌దాసు, రమేష్, భద్రయ్య, శ్రీహరి, మోహన్‌రావు, ధనంజయ్, పుల్లారావు, ఓంకార్ ఉన్నారు.

సమస్యలపై పోరాటాలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం అభివృద్ధికి , ప్రజా సమస్యల పరిష్కారానికి దశల వారీ పోరాటాలు నిర్వహించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి ఎస్‌కె.జానిమియా తెలిపారు. ఈ మేరకు నూతనంగా ఎన్నికైన ఖమ్మం నగర సమితి కార్యదర్శి వర్గ సమావేశం సోమవారం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం వేల సంఖ్యలో పేదలు నగరానికి చేరుకున్నారని వారికి నివాస స్థలాల సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పోటు కళావతి, బిజి క్లెమెంట్, మేకల శ్రీనివాసరావు, సాంబశివరెడ్డి, శశిధర్, ఏనుగు గాంధీ, నానబాల రామకృష్ణ, వరదా నర్సింహారావు, పీట్ల కృష్ణమూర్తి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.